క్లుప్తంగా

ప్రజల సమస్యలు సత్వరం పరిష్కరించండి

మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే జీవీ



వినుకొండ(నూజెండ్ల): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ మండలంలోని సమస్యలపై చర్చించారు. అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు సమన్వయంతో ప్రభుత్వ పథకాలు అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యాలయాల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీరభద్రాచారి, తహసీల్దార్ రమేష్‌బాబుతో పాటు మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

14న మండల సర్వసభ్య సమావేశం

ఈపూరు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రంగనాయకులు బుధవారం తెలిపారు. ఈ సమావేశంలో మండలంలోని అన్ని శాఖల్లోని పనులపై, సమస్యలపై, అభివృద్ధి పనులపై, శానిటేషన్‌పై చర్చించడం జరుగుతుందని తెలిపారు. గ్రామ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న మినీలారీ



నాదెండ్ల: జాతీయ రహదారిపై గణపవరం యూటర్న్ వద్ద మహీంద్రా బొలేరో మినీ లారీ వాహనం ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గణపవరం వేలూరు రోడ్డులోని ఓ ఆయిల్ మిల్లులో లోడింగ్ నిమిత్తం జాతీయ రహదారి నుంచి వేలూరు రోడ్డులోకి వెళ్తున్నది. ఇదే సమయంలో గుంటూరు వైపు నుంచి తిరుపతి వెళ్తున్న మహీంద్రా బొలేరో వాహనం ఢీకొట్టింది. ట్యాంకర్ వెనుక టైరును ఢీకొనటంతో టైరు పగిలి ఒక్కసారిగా ట్యాంకర్ మలుపు తిరిగింది. బొలేరో వాహనం ముందుభాగం పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వడ్డెర సేవా సంఘం పట్టణ నూతన కమిటీ ఎంపిక



నరసరావుపేట: స్థానిక బీసీ ఓబన్న కమ్యూనిటీ హాలులో బుధవారం మాజీ అధ్యక్షుడు చల్లా హనుమంతరావు అధ్యక్షతన వడ్డెర సంక్షేమ సేవా సంఘ పట్టణ నూతన కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా రిటైర్డు ఎమ్డీఓ దేవళ్ల వెంకటేశ్వరరావు, అధ్యక్షుడిగా కోటప్పకొండ దేవాలయ ట్రస్టు మాజీ సభ్యుడు బత్తుల శివయ్య, ఉపాధ్యక్షులుగా మక్కెన మల్లికార్జునరావు, బత్తుల ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శిగా తిరుమలకొండ నరసింహారావు, జాయింట్ సెక్రటరీలుగా తురగా నాగూల్‌మీరా, దేవళ్ల శ్రీనివాసరావు, కోశాధికారిగా బత్తుల వెంకటేష్‌లను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



అమరావతి: మండల పరిధిలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం నుంచి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కంటి వైద్యాధికారి పి.సుబ్బారావు తెలిపారు. బుధవారం స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో సుమారు 150 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. అందులో 20 మందికి దృష్టి సమస్యలను గుర్తించి కళ్లజోళ్లకు సిఫార్సు చేశామన్నారు. వారికి కళ్ళజోళ్లు ఉచితంగా అందచేస్తామన్నారు. అలాగే 10 మంది విద్యార్థులలో కళ్లకలకను గుర్తించి మందులు పంపిణీ చేశామన్నారు. అలాగే మండలంలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 27వ తేదీ వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

- డీఎంహెచ్ఓ బి.రవి
- గణపవరం, నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తనిఖీలు



గణపవరంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ రవి

నాదెండ్ల: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు, వైద్య బృందాలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి బి.రవి పేర్కొన్నారు. గణపవరం, నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. గణపవరం పీహెచ్‌సీలో జరుగుతున్న ఇమ్యూనైజేషన్ ప్రక్రియను పరిశీలించి లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో పరిశుభ్రత, సిబ్బంది సమయ పాలనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి పీహెచ్‌సీలో బుధ, శనివారాల్లో ఇమ్యూనైజేషన్ ప్రక్రియ జరుగుతుందని, పీహెచ్‌సీలతో పాటూ హెల్త్ సబ్‌సెంటర్‌లలో ప్రతి సోమ, గురువారాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ డీసీజీ వ్యాక్సిన్ వేయాలన్నారు. అరవై ఏళ్లు పైబడిన వారు మద్యం, పొగతాగే అలవాట్లు ఉన్నవారు వయస్సుతో నిమిత్తం లేకుండా వ్యాక్సిన్లు వేయించుకోవాలన్నారు. ఒక కుటుంబంలో ఐదేళ్ల పైబడి క్షయ వ్యాధి సోకిన వారి కుటుంబ సభ్యులందరూ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. దీని వలన భవిష్యత్తులో క్షయ నివారించుకోవచ్చన్నారు. ఆయనతో పాటు వైద్యాధికారి ప్రసాద్‌నాయక్, సిబ్బంది ఉన్నారు.

స.హ.చట్టంపై రైతులకు అవగాహన అవసరం

ఏడీఏ బోయపాటి రవిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ రవిబాబు

శావల్యాపురం: ఖరీఫ్ సీజను సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారని ఏడీఏ బోయపాటి రవిబాబు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈపూరు, శావల్యాపురం మండలాల్లో రైతుభరోసా కేంద్రాల్లోని వీఏఏలకు పొలంబడి, ఈ–పంట నమోదు, సమాచార హక్కు చట్టంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ బోయపాటి రవిబాబు ఆర్టీఐ యాక్ట్ 2005 ప్రకారం రైతులందరు సమాచార చట్టంపై అవగాహన కల్గియుండాలన్నారు. అధికారులు రైతులకు సకాలంలో సమాచారం ఇవ్వాలని, నిబంధనలు అతిక్రమించిన వారిపై అపరాధ రుసుము విధించటంతో పాటు కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. పొలంబడి కార్యక్రమం 14 వారాలు పాటు జరుగుతుందని వ్యవసాయ అధికారులు కేటాయించిన పొలాన్ని వారానికి ఒకసారి సందర్శించి రైతులకు వ్యవసాయ పద్ధతులపై మెరుగైన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఈ సీజనులో అన్ని రైతుభరోసా కేంద్రాల్లో ఎరువుల కొరత లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామన్నారు. ఈసదస్సులో మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు, ఏఈఓ పురేటి అశోక, ఈ–పంట ట్రైనర్ నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధి హామీ సామాజిక తనిఖీలు



గణపవరంలో జరిగిన గ్రామ సభలో మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ సీహెచ్ ఆదినారాయణ

నాదెండ్ల: మండలంలోని ఎనిమిది గ్రామాల్లో బుధవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలపై గ్రామ సభలు నిర్వహించారు. ఇర్లపాడులో ఎస్ఆర్‌పీ శరత్‌కుమార్, అప్పాపురంలో కేసీ ఓబులేశు, గణపవరంలో సీహెచ్ ఆదినారాయణ, బుక్కాపురంలో జి.ప్రసాదరావు, ఎండుగుంపాలెంలో ఎం.శివయ్య, సంకురాత్రిపాడులో బి.మహేష్, తూబాడులో కిషోర్‌కుమార్, జంగాలపల్లెలో ఎస్.తిరుపాల్ నిర్వహించారు. గత పది రోజులుగా మండలంలో ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకూ జరిగిన పనుల్లో అవకతవకలపై గ్రామ సభల్లో వెల్లడించారు. గణపవరంలో జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వలేటి హిమంతరావు, పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక...

మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం ఉదయం 10 గంటలకు గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీవో పుష్పరాజు తెలిపారు. మండలంలోని 14 సచివాలయాల పరిధిలో జరిగే ప్రజావేదికకు పీడీ జోసఫ్‌కుమార్, ఎస్ఆర్‌పీ ఎం.లోకేష్, స్థానిక ప్రజాప్రతినిదులు, అధికారులు పాల్గొంటారన్నారు.

పారుపల్లిలో కొనసాగుతున్న వైద్యశిబిరం



పారుపల్లి గ్రామంలో ఇళ్లను పరిశీలిస్తున్న మలేరియా అధికారి రత్నాకర్, సిబ్బంది

పారుపల్లి(క్రోసూరు): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుస్తు చర్యల్లో భాగంగా మండలంలోని పారుపల్లిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం బుధవారం కొనసాగింది. ఈ వైద్య శిబిరంలో 35 మందికి వైద్య పరీక్షలు చేయటం జరిగిందని ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతిర్మయి తెలిపారు. జ్వరాల కేసు ఒకటి ఉన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా డీఎంవో రవీంద్ర రత్నాకర్ హాజరై గ్రామంలోని అన్ని వీధులు పరిశీలించారు. ఆయన దగ్గరుండి పెరిడొమెస్టిక్ చేయించారు. మురుగు కాలువల్లో లార్వాను నిర్మూలించేందుకు ఎబ్బెట్ ద్రావణం పిచికారీ చేయటం, పిచ్చిచెట్లు, కంప ఇళ్ల మధ్య లేకుండా తొలగించి శుభ్రంగా ఉంచటం, నీళ్లు నిలబడే ప్రదేశాలలో నీళ్లను తొలగించటం చేపట్టారు. జ్వరాలు రాకుండా గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, దోమతెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రైతులందరూ పంట నమోదు చేసుకోవాలి



వ్యవసాయ, ఉద్యాన సిబ్బందితో సమీక్ష సమావేశంలో క్రోసూరు ఏడీఏ హనుమంతరావు

అమరావతి: మండలంలో రైతులందరూ తమ పొలాల్లో వేసిన పంటను నమోదు చేసుకునేలా గ్రామ వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులు కృషి చేయాలని క్రోసూరు వ్యవసాయ శాఖ ఏడీఏ హనుమంతరావు అన్నారు. బుధవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో మండలంలోని వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో ఏడీఏ మాట్లాడుతూ గ్రామాలలో కౌలు రైతులను గుర్తించి వారికి కౌలు రైతు కార్డులు మంజూరయ్యేలా చూడాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ప్రతి రైతు తమ పంట వివరాలను దగ్గరలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. రైతులకు పంట నమోదులో వ్యవసాయ, ఉద్యాన సిబ్బంది సహకరించటమే కాకుండా సాగు సమయంలో తగు సలహాలు, సూచనలు ఇవ్వటానికి నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో మండల వ్యవసాయశాఖాధికారి అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ



ముప్పాళ్ళ: ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశీలించారు. విధుల్లో ఉన్న సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. ఎన్నికలు ముగిసిన తర్వాత జరుగుతున్న గొడవల నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలపై పలు సూచనలు చేశారు. సమస్యాత్మక గ్రామాలపై నిఘా పెంచాలని సూచించారు. అనంతరం మాదల గ్రామాన్ని సందర్శించి, స్థానికులతో మాట్లాడారు. సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబు, రూరల్ సీఐ రాంబాబు, ఎస్సై పి.హజరతయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కేజీబీవీలో జీవిత నైపుణ్యాలపై అవగాహన

క్రోసూరు: గుడ్ షెపర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం క్రోసూరు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో జీవిత నైపుణ్యాలపై అవగాహన సదస్సు జరిగింది. సంస్థ కార్యకర్త లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బచపన్ బచావో స్టేట్ కోఆర్డినేటర్ తిరుపతిరావు హాజరై మాట్లాడుతూ పిల్లలకు జీవిత నైపుణ్యాలు తప్పకుండా అవసరమని అన్నారు. మంచి కమ్యూనికేషన్ ఉంటే భవిష్యత్తు బావుటుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ బలాలు.. బలహీనతలు తెలుసుకుని ముందుకు సాగాలన్నారు. ప్రతి ఒక విద్యార్థి తమ స్థాయిని తెలుసుకొని చదవాలన్నారు. గుడ్ షెపర్డ్ సంస్థ డైరెక్టర్ సిస్టర్ విన్నరసి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నిర్ణయం తీసుకునే అధికారం కలిగి ఉండాలన్నారు. జీవితంలో ఒక లక్ష్యం కలిగి ఉండాలన్నారు. కౌమార దశలో పిల్లలు ఆకర్షణకు గురై జీవితాలను పాడు చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది బ్యూలా మరియమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

గుడ్ టచ్–బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంచుకోవాలి



చిలకలూరిపేట: విద్యార్థినులు స్పర్శలోని తేడాలను కనిపెట్టాలని పట్టణ ఎస్ఐ ఎస్.సుమన్ చెప్పారు. పట్టణంలోని సెయింట్ ఛార్లెస్ హైస్కూల్‌లో సోషల్ క్లబ్ ఆధ్వర్యంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశంపై విద్యార్థినులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ సుమన్ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో సన్నిహితంగా మాట్లాడరాదని, తినుబండారాలు తీసుకోరాదని చెప్పారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళా పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్, ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్‌లకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. స్కూల్ హెచ్ఎం సిస్టర్ మేరీ విమల, కరస్పాండెంట్ సిస్టర్ సుందరి, ఉపాధ్యాయులు షేక్ జాఫర్, అంజయ్య, సుబ్బారావు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో 51.2 మిల్లీమీటర్ల వర్షం

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం కూడా వర్షం కొనసాగింది. మండల కేంద్రమైన రొంపిచర్లలో బుధవారం ఉదయానికి 36.6 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. నరసరావుపేట డివిజన్‌లోని శావల్యాపురంలో 37.8 ఎం.ఎం, చిలకలూరిపేటలో 27.8 ఎం.ఎం వర్షపాతం నమోదు కాగా ఈపూరులో 32.4, యడ్లపాడులో 6.6, నరసరావుపేటలో 36.2, నాదెండ్ల 20.6, నూజెండ్ల 28.6, వినుకొండ 30.2 అలాగే బొల్లాపల్లి 51.2 ఎం.ఎం వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ వర్షాలతో గ్రామాల్లో ఉన్న వాగులు, వంకల్లో జలప్రవాహం ప్రారంభమైంది.

ఈ–క్రాప్ నమోదు ప్రారంభించండి

రొంపిచర్ల: ఖరీఫ్ సీజన్‌లో ఈ–క్రాప్ నమోదు సెప్టెంబర్ 15వ తేదీలోగా పూర్తి చేయాలని తహసీల్దార్ అంకారావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రామ వ్యవసాయ సహాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాది కూడా ఈ క్రాప్ నమోదు ప్రారంభించాలన్నారు. ముందుగా సుబాబుల్ తోటలు, పండ్ల తోటలను ఈ క్రాప్ చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి పి. విజయభాస్కర్ మాట్లాడుతూ పంటల నమోదును ఎప్పటికప్పుడు పూర్తిచేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

అచ్చంపేట: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన స్థానిక సాయిబాబా దేవాలయం సమీపంలోని వే బ్రిడ్జి వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. క్రోసూరులో నివాసముంటున్న తుమ్మా జగదీష్‌రెడ్డి అచ్చంపేట నుంచి బైక్‌పై క్రోసూరు వెళుతుండగా వే బ్రిడ్జి సమీపించగానే ఎదురుగా వచ్చే ఆటో ఢీ కొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో జగదీష్‌రెడ్డి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. 108 అంబులెన్స్‌లో సత్తెనపల్లిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. క్రోసూరు నాలుగురోడ్ల సెంటర్‌లో నివాసం ఉంటూ పాలవ్యాపారం చేసుకునే తుమ్మా ప్రసాదరెడ్డి రెండవ కుమారుడు జగదీష్‌రెడ్డి తండ్రికి చేదోడు వాదోడుగా ఉండేవాడు. హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తి చేసిన జగదీష్‌రెడ్డి త్వరలో ఫారిన్ వెళ్లే ప్రయత్నంలో ఉన్నట్లు తెలిసింది. ఇంతలో ఈ ఘటన జరిగింది.

పోలేరమ్మ ఆలయంలో చోరీ



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం పమిడిపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు ఆలయం తాళాలు పగలగొట్టి హుండీలోని నగదును దోచుకెళ్లారు. ఈ సంఘటనపై ఐనవోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చోరీకి గురైన సొమ్ము సుమారు రూ.6వేలు ఉండొచ్చని ఆలయ వర్గాలు తెలిపాయి.

ఆలయాల్లో వరుస చోరీలతో బెంబేలు..

గత పది రోజుల క్రితం శావల్యాపురం మండలం బొందిలిపాలెంలోని అడవి పేరంటాలమ్మ అమ్మవారి ఆలయంలో చోరీ జరిగింది. అక్కడ కూడా తాళాలు పగలగొట్టి హుండీలోని నగదు, సీసీ కెమెరాలు, హార్డ్ డిస్క్‌తో సహా అపహరించుకెళ్లారు. ఆలయాల్లో వరుస దొంగతనాలతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

వారంలో ఒక్కరోజు చేనేత వస్త్రాలు ధరిద్దాం

జాతీయ చేనేత దినోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు



కలెక్టరేట్‌లో చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: చేనేత అంటే వస్త్రం కాదు..జీవన విధానమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన 10వ జాతీయ చేనేత దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా చేనేత కార్మికులు నేసిన దుస్తులను పరిశీలించారు. చేనేత కార్మికులకు చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చేనేత రంగాన్ని నారా లోకేశ్ ప్రత్యేకంగా అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారని అన్నారు. ఈసందర్భంగా చేనేత ర్యాలీకి పచ్చజెండా ఊపి ప్రారంభించి పాల్గొన్నారు. డీఆర్వో కె.వినాయకం, నాయకులు కపిలవాయి విజయ్‌కుమార్, చేనేత, మగ్గం కార్మికులు పాల్గొన్నారు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్..

సమర్థవంతమైన ఆరోగ్య పరిరక్షణ విధానాలతోనే వ్యాధుల నివారణ సాకారమవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని 13,16,23,32 వార్డులలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. మున్సిపల్ కార్మికులతో కలిసి కాలువల్లో చెత్తను తొలగించారు. పిచ్చి మొక్కలు, చెత్త ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో దోమలు వ్యాపించకుండా ఫాగింగ్ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్త, నాయకులు కపిలవాయి విజయ్ కుమార్, మున్సిపల్ కార్మికులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత
- ముగిసిన తల్లిపాల వారోత్సవాలు అవగాహన సదస్సులు



వయ్యకల్లు సెంటరులో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ కుప్పం శ్రీలత

శావల్యాపురం: మండలంలోని వయ్యకల్లు, పోట్లూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో తల్లిపాల వారోత్సవాలు ముగింపు అవగాహన సదస్సులు బుధవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుప్పం శ్రీలత పాల్గొని మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువుకు ముర్రుపాలు తాగించటం ద్వారా వ్యాధి నిరోధకశక్తితో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. జీర్ణశక్తి మెరుగుపడి, ఆరోగ్య రుగ్మతల నియంత్రణకు దోహదపడుతుందన్నారు. తల్లిపాలు అమృతంతో సమానమన్నారు. బిడ్డ శారీరకంగా ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. తల్లి బిడ్డకు మంచి బాంధవ్యం ఏర్పడతుందన్నారు. తల్లిపాలు శిశువుకు మొదట టీకాతో సమానమన్నారు. 0–6 నెలల నుంచి 2 సంవత్సరాల లోపు శిశువుకు తల్లి పాలతో పాటు ఈదనపు ఆహారం ఇవ్వాలన్నారు. తల్లిపాలపై అపోహాలు నమ్మరాదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పుణ్యకుమారి, సుభావతి, నాగరాజ, శ్రీలక్ష్మి, అరుణ, విజయలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త నాగలక్ష్మి, గ్రామ మహిళా పోలీసులు మౌనిక, గురవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ...

రొంపిచర్ల: మండలంలోని అన్నవరం, వి.రెడ్డి పాలెం గ్రామాల్లో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ సమీమ్ సుల్తానా తల్లిపాల వలన తల్లికి బిడ్డకు కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ నజీర్, అంగన్‌వాడీలు, ఆశాలు, పలువురు బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

'క్విట్ కార్పొరేట్'ను జయప్రదం చేయండి

కరపత్రాలను ఆవిష్కరించిన నాయకులు



పల్నాడు విజ్ఞాన కేంద్రంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నరసరావుపేట: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 9న క్విట్ ఇండియా డే స్ఫూర్తితో నిర్వహించే క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం, సీఐటీయూ జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు కోటప్పకొండరోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాల్‌రావు మాట్లాడుతూ రైతు సంఘాల సమన్వయ సమితి, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పల్నాడు జిల్లాలోని మండల, పట్టణ కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఎదుట చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, కౌలురైతులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అధికారంలోకి రాగానే రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని, స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరల చట్టం చేస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ వాటిని అమలు చేయకపోగా, మొత్తం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పేందుకు మూడు వ్యవసాయ నల్ల చట్టాలు చేసిందన్నారు. ఈ చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలపాటు రైతులు అనేక నిర్బంధాలను ఎదుర్కొని పోరాటం చేసి చట్టాలను రద్దు చేయించగలిగారని, ఈ ఉద్యమ విరమణ సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు విత్తన వ్యాపారం, క్రిమిసంహారక మందుల వ్యాపారం కార్పొరేట్లకు కట్టబెట్టిందని అన్నారు. అదేవిధంగా ఏళ్ల తరబడి కార్మికుల పోరాడి సాధించుకున్న చట్టాలను కూడా నిర్వీర్యం చేసి లేబర్ కోడ్‌ల పేరుతో మరోసారి కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. కమ్యూనిస్టుల మద్దతుతో యూపీఏ ప్రభుత్వంలో సాధించిన ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చాలని చూడటం పేదల పొట్ట కొట్టడమే అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరించే ప్రజావ్యతిరేక, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా రైతులు, కార్మికులు పెద్దఎత్తున నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కామినేని రామారావు పిలుపునిచ్చారు.

సర్దుబాటు పేరుతో పాఠశాలల మూసివేతను సహించం

ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు

చిలకలూరిపేట: పని సర్దుబాటు పేరుతో పది మంది లోపు విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలల మూసివేత ఆలోచనలను విద్యాశాఖ విరమించుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు చెప్పారు. సంఘ సమావేశం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయకుండా, చర్చించకుండా ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకోవడం వల్ల విద్యా వ్యవస్థ బలహీనపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా ఉపాధ్యాయ పదోన్నోతులు కల్పించాలని,ఆ తర్వాతే పని సర్దుబాటు విషయం ఆలోచన చేయాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర పూర్వకార్యదర్శి పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ జీఓ 117 రద్దు, బోధనేతర పనులను రద్దు చేయాలని కోరారు. హైస్కూల్‌లలో 3,4,5 తరగతులు విలీనం చేయడం వలన విద్యార్థుల సంఖ్య తగ్గిందని తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లోని ఉపాధ్యాయులను హైస్కూళ్లకు పంపితే ప్రాథమిక పాఠశాలలు మూత పడతాయన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఒక్క సమావేశాన్ని ప్రభుత్వం ఉపాధ్యాయుల సంఘాలతో ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. పని సర్దుబాటు పేరుతో ప్రాథమిక పాఠశాలను మూసివేయాలని చూస్తే రాష్ట్ర స్థాయిలో ఉద్యమ కార్యాచరణకు ఎస్టీయూ ప్రణాళికను రూపొందిస్తుందని వెల్లడించారు. సమావేశంలో సంఘ నాయకులు వినుకొండ అక్కయ్య, మేకల కోటేశ్వరరావు, వడ్లాన జయప్రకాశ్, బొంతా రవి, షేక్ మస్తాన్‌వలి, జి కోటేశ్వరరావు, షేక్ మగ్బుల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.